"నారాయణ! ... నారాయణ! ... మధ్య పిడి గోల ఏంటోయ్ శనిలాగా?" గుసగుసలాడాడు వెంకూ అనబడే వెంకట్రావు.

"తంపులకోరు నారదుడులాగ ఏమిట్రా ఆ నారాయణ నామస్మరణ? ఏమి వచ్చింది?" అడిగాడు చలం.

"ఇంకేమి రావాలి ఇంతకంటే ఉపద్రవం? చదువు, శేఖరంగాడు తెచ్చిన తిరుగుటపా."

బిగ్గరగా చదివాడు చలం.

"వెంకట్రావు గారికి,

సదాచార సంపన్నుడూ, నాకు అత్యంత సన్నిహితుడూ అయిన శ్రీ శేఖరంగారు మీ ప్రేమలేఖ తెచ్చారు కనక సరిపోయింది. లేకుంటే ఏమయ్యేదో! మీలో ప్రకోపించిన పైత్యానికి ఇది మాత్రగా వాడుకుని మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి. సెలవు

—మాలతి."

"క్షన్న! క్షన్న!" అన్నాడు చలం.

గుడ్లు తేలవేశాడు శేఖరం.

"అసలేం జరిగిందిరా?" అడిగాడు చలం.

"ఏం జరుగుతుంది? తిన్నగా ఆమె కివ్వగలిగిన ధైర్యంలేక, నా ఫిజిక్సు రికార్డే టపాలపెట్టె అనుకుని, అందులో పడేశాడు గాబోలు ప్రేమలేఖ, నేరుగా ఆమెకు చేరింది!"

"చేరిన తరవాత ఏం జరిగిందిరా?" ప్రశ్నించారు వెంకూ, చలం ఇద్దరూ.

"ఆ తరవాత మరేం జరుగుతుంది? 'ఏమిటి శేఖరం, నీ రికార్డులో ఈ ఉత్తరం?' అని అడిగిందిరా! 'ఏ ఉత్తరం మాలతీ?' అన్నాను. 'అదే! మీ రూం మేటు వెంకూగారి చలవ! చూడు' అంటూ నా కిచ్చింది."

"అహా!"

"చూద్దును గదా, కవిత్వం! నాకేటూ మాట్లాడాలో తెలియలేదు. 'దీన్ని ఖద్దును ప్రిన్సిపాలుగారి ఎదట దఖలు పరుస్తాను. నీ రికార్డులో ఇది దొరికిందని నువ్వు సాక్ష్యం ఇవ్వాలి, శేఖరం' అన్నదిరా."

"అయ్యో బాబోయ్!"

"నాకు నఖశిఖపర్యంతం దడ పుట్టిందనుకో! 'లేదు మాలతీ, మన్నించు. పొరపాటంతా నాదనుకో. నీవంటే వాడు పడి చస్తాడు. ఏదో పొరపాటు చేశాడు. నీవు నా ఫిజిక్సు రికార్డు అడిగింది విని గప్చుని అందులో పెట్టేసి ఉంటాడు. క్షమించు ఈసారికి' అన్నాను."

"క్షమించానన్నదా?" అడిగాడు వెంకూ.

"నవ్వేసిందిరా."

"నవ్వింది?!" దీర్ఘం తీశాడు వెంకూ ఆశతో.

"నవ్వింది, నవ్వింది. 'నీకెందుకు శేఖరం. ఈ మధ్యవర్తిత్వం? ఇంత మంచివాడివి! ఆ వెంకూలాటి వాడితో నీకు స్నేహమేమిటిలెదూ!' అందిరా."





"ఆ! నీవేమని అఘోరించావ్?"

"ఏమని అఘోరిస్తానూ? నేను పేదవాణ్ణి, మాలతీ. వాడి సహాయం లేకుంటే నే నింతవాణ్ణి కాలేను. వాడు వట్టి అమాయకుడు. పిరికివాడు. నేనంటే కూడా పడిచస్తాడు. వాడి అండదండలు లేకపోతే నాకు తీరని నష్టం కలుగుతుంది. తెలియక ఈ సాహసం చేశాడు, మన్నించు' అన్నాను."

"ఛష్! హీరోని అమాయకుడూ, పిరికివాడూ అని వర్ణిస్తావుట్రా?" ఉక్రోషపడ్డాడు వెంకూ.

"ఏడిశావులేవోయ్! వాడేదో ఆసద గడుపుకోడానికి అలాగ అనిఉంటాడులే. ఇంతలోనే నిక్కి నీల్గాలా?" అన్నాడు చలం.

"ఆ తరవాత ఏమైందిరా?"

"ఏమైంది? 'నీవెవర్ని అయినా ప్రేమిస్తున్నావా, శేఖరం?' అని అడిగింది. 'లేదు మాలతీ, నాకా అర్హతలు లే'వన్నాను."

"ఏడవలేక పోయావ్?"

"మరి ఈ ఉత్తరం ఎప్పుడిచ్చిందిరా?"

"అప్పుడే. 'ఉండు శేఖరం, రెండు ముక్కలు సమాధానం వ్రాయకపోతే నీ స్నేహితుడు నొచ్చుకుంటా' డంటూ అక్కడే గబగబా వ్రాసి కవరులో పెట్టి అంటించి 'క్షమించు, శేఖరం, ఈ ఉత్తరాన్ని వెంకట్రావుగారికియ్యి' అన్నదిరా."

"నువ్వేమన్నావ్?"

"ఏమంటాను. తెచ్చినవాడికి ఇవ్వడం నొప్పేమిటి? మాట్లాడక ఊరుకున్నాను. 'నీవూ ఎవర్ని అయినా ప్రేమించి మా వెంకూగారితో ఉత్తరాలు పంపిస్తే

స్త్రీ ప్రదర్శించే భావాల మాటున దాగే భావాలు చదవడం ఎవరికీ సాధ్యంకాదు. కాకుంటే ఈ లోకంలో ఇంత సాహిత్యం పెరిగి ఉండేది కాదు. ప్రపంచంలో ఇన్ని సమస్యలూ ఉత్పన్నం అయి ఉండేవి కావు. స్త్రీని ఉన్నదున్నట్టుగా అంగీకరిస్తే మాత్రం జీవితం ఇప్పటికన్నా దుర్భరంగా తయారవుతుంది.

చూడాలని ఉంది, శేఖరం' అన్నదిరా. సిగ్గుపడిపోయాననుకో!"

"వాజమ్మవి. అంతకంటే మరేం చేస్తావ్!" అన్నాడు వెంకూ.

"అది సరేగాని ముందు కర్తవ్యం ఆలోచించవోయ్!" అన్నాడు చలం.

"ఇంకేం ముందురా? ముందంతా ఒక్కసారిగా అంధకారబంధురం అయిపోతే!"

"ఏడిశావ్ పిరికిసన్నాసీ! వాడన్నాడంటే అనడూ? తిట్టి తూలనాడ లేదు. ఓమాత్రానికి సమాధానం వ్రాసింది గదా. నీ ధైర్యాన్ని పరీక్షకి పెడుతుందేమోననుకో గూడదూ?"

"ఒరేయ్, శేఖరం! ఇలాంటి ఉత్తరాలు మళ్ళీ మళ్ళీ వ్రాస్తే ఏం చేస్తానో చూడని వార్నింగుగా ఇచ్చిందేమిటిరా?" అడిగాడు వెంకూ.

**జైరాజ్**

"అలాగని అనలేదనుకో. ఇచ్చిందిగా జవాబు! అది వార్నింగు కాదేమిటి? అయినా సిగ్గు లేదా నీకు?"

"ఓరే బ్రదర్, నీవలా నిరుగారిపోతే ఎలా చెప్పు? ఆమే అన్నదిగా జవాబు వ్రాయకపోతే ఎదటివాడు నొచ్చుకుంటారని. మరొక్కటి ఇస్తాను. పట్టుకువెళ్ళి 'క్షమాపణ ఉత్తరం' అంటూ ఇవ్వరా బాబూ."

"బాగు! బాగు!" మూలిగాడు శేఖరం.

వెంకూ, చలం, శేఖరం ముగ్గురూ రూమ్మేట్సు. ముగ్గురూ కాలేజీలో మూడో క్లాసు. అందు శ్రీ వెంకూగారు డబ్బున్న మహరాజు, విలాసపురుషుడు. సరదాకోసం చదువుతున్నాడు. ఉదార స్వభావుడు. శేఖరానికి పేదవాడని ఫీజు గ్రాంటు తనే కడుతుంటాడు. కళాన్వేషి, షోకిల్లా. శ్రీ చలంగారు అట్టే ధనవంతుడు కాకపోయినా మధ్యతరగతికి చెందినవాడు. కవిత నేర్చుకోవాలని తహతహ జాస్తి. నిత్యం కథలనీ గేయాలనీ ఏవేవో వ్రాస్తుంటాడు. అతని వ్రాతలేవీ అచ్చుపడలేదింకా. వెంకూ ప్రేమ లేఖకు కూర్పులో తోడ్పడ్డాడు. ఇక శ్రీ శేఖరంగారు—పైన వచ్చిన కొన్ని వివరాలు పోను — జిజ్ఞాసాపరుడు, తెలివైనవాడు, నిరాడంబరజీవి, క్లాసుమేట్సుటందరికీ ప్రీతిపాత్రుడు. మాలతికూడా తెలివైనది కావడం చేత ఆమెకు చదువులో ప్రత్యర్థి. ప్రతి పరీక్షలోనూ ద్వితీయస్థానాన్నించి ప్రథమ స్థానానికి రాకుండా మాలతికి అడ్డుబండ. ప్రత్యర్థులేగాని వారిరువురి మధ్యా వైమనస్యాలేవీ లేవు. ఎప్పుడూ శేఖర్ని ఒక స్నేహితుడుగానే భావిస్తుందామె

అతి బలవంతాన రెండో ఉత్తరం పంపించాడు వెంకూ శేఖరంచేత. ఆశ్చర్యం! సమాధానం వచ్చింది.

"వెంకూగారూ!

తప్పు చెయ్యడం మానవునికి పరిపాటి. దిద్దుకోవడం తెలివైనవారి లక్షణం. సజ్జనుడైన శేఖరం సాహచర్యంలో ఉన్నవారు ఆమాత్రం మీ తప్పు దిద్దుకోకపోతారా అని భావించి హెచ్చరిస్తే, శ్రుతిమించి రాగాన పడ్డారు. మీ రాగం గార్దభ స్వరంలాగ వినిపించింది నాకు. గ్రహించ గలరు.

—మాలతి."

"ఇదేం ప్రారబ్ధంరా, బాబూ! రెండు తిట్లు వ్రాస్తే పోయేదిగాదూ. మధ్యన హెచ్చరికలెందుకూ? పిల్లి గురించి ఈ ప్రశంసలెందుకూ!" ఏడ్చుకున్నాడు వెంకూ.

"ఈసారేం జరిగిందిరా?" అడిగాడు చలం.

"ఏమీ జరగలేదు. నన్ను 'క్షమాపణ కోరుతూ వెంకూ జవాబు వ్రాసిచ్చాడు. చూస్తానంటే ఇస్తా'నన్నాను. ఇలా తెమ్మని లాగేసి చదువుకుని, నకాలున నవ్వింది. అందులో విషేం వెలగబెట్టాడో ఏమో!"

"నా ఉత్తరంలో సంగతులేమైనా నీతో చర్చించిందా?"

"అబ్బే! లేదు. కాని 'శేఖరం! ప్రేమంటే నీ ఉద్దేశ్యమేమి'టని అడిగింది."

"ఆహా!" ఆడించాడు తల చలం.

"నీ బోడి ఉద్దేశ్యమేదైనా చెప్పావా?" అడిగాడు వెంకూ.

"చెప్పాను. 'స్త్రీపురుషులిద్దరు ఒండొరులలోని సత్ప్రవర్తనవల్లనూ, దానికనుబంధంగా భగవంతుడను గ్రహించిన రూపురేఖలవల్లనూ ఒకరినొకరు ఆకర్షించుకుని దగ్గర కావడమే ప్రేమంటే అన్నాను."

"ఓహోహో! ఒరేయ్, నీవు ప్రయత్నించవుగాని నీకూ కవిలక్షణాలున్నాయిరోయ్!" ప్రశంసించాడు చలం.

"దానిమీద ఆవిడగారి వ్యాఖ్యేమిటో?" వెంకూ కసి.

"వ్యాఖ్యానించలేదు. 'నీకా అవకాశం ఎక్కడా లభించలేదా, శేఖరం?' అని అడిగింది."

"ఓ యబ్బో! అంతపాటే! వీడు ఒక చచ్చు ఉల్లిపాయ అని ఆమెగారికేం తెలుసు!" నవ్వాడు వెంకూ.

"ఒరేయ్! వాణ్ణి అలా తీసిపారెయ్యకు బొత్తిగా! ఆఁ, నీవేమన్నావురా శేఖరం?"

"అవకాశం ఉన్నా నేనందుకు ముందంజ వెయ్యననీ, కీడెంచి మేలెంచాలనీ, అందుమూలంగా సత్ఫలితానికి బదులు దుష్ఫలితం ఎదురైతే నా చేజేతులా నా భవిష్యత్తు పాడుజేసుకోవలసి వస్తుందనీ చెప్పాను."

"తేలికగా చెప్పలేకపోయావ్ సన్యాసినని! ఇంత వీడుపెందుకు?"

"నీకలాగే ఉంటుందిలేరా, వెంకూ! అదిగో వాగాశే!" ఉడుక్కున్నాడు శేఖరం.

"లేదులేరా, బ్రదర్! ఇంకా ఏమందో చెప్పవోయ్!"

"'ఒకవేళ స్త్రీ ఎవరైనా ముందంజవేస్తే ఏం జేస్తావు, శేఖరం?' అనడిగింది. 'ఆమె గుణగణాలు, అందచందాలు నాకు నచ్చితే స్వాగతం ఇస్తానేమో మాలతీ' అన్నాను."

"ఓ యబ్బో! వీడూ ఘటికుడేనోయ్! ఎంత లోలోపల దాచుకున్నాడు!"

"ఉండరా మధ్య మధ్య బోడి వ్యాఖ్యానాలూ నువ్వూ! చెప్పుకుపోరా బాబూ, శేఖరం" అన్నాడు చలం.

"చెప్పేందుకేముంది? 'కష్టపడి క్షమాపణ కోరుతూ నీ మిత్రుడు జాబు వ్రాశాడు గదా, హార్ట్ని వెలిబుచ్చుతూ. రెండు ముక్కలు వ్రాయకపోతే బాగుండదా?' అంటూ రెండు గీతలు గిలికి నాకిచ్చింది సీలుచేసి."

మరునాడు ఉదయం మరో ఉత్తరం ఇచ్చాడు వెంకు, "బాబ్బాబు, 'మీరు హార్ట్ని వెలిబుచ్చుతూ వ్రాసిన ఉత్తరానికి నా మిత్రుడు కృతజ్ఞత తెలుపుతూ వ్రాశా'డని ఇవ్వరా, నాయనా" అంటూ.

"ఛ ఛ! పోయినసారి ఒక అబద్ధం ఆడావు. లెంప పెట్టుతిన్నా సిగ్గులేదు! ఇందులో ఏమని కూశావో? ఏం తగునో?"

"నాయన్నాయనా, ఏది వచ్చినా నే పడతాగా?" బతిమాలాడు వెంకూ.

మూడో ఉత్తరానికి సమాధానం.

"వెంకటేశ్వర్రావ్!

నీ అబద్ధాలతో మధ్యపెట్టి, మధ్య గౌరవనీయుడైన వ్యక్తితో జానిపని చేయిస్తున్నావు. నీ కవిత్వంతో చెణుకులు విసిరావు. అబ్బ! పాత చింతకాయ పచ్చడి! 'నీ వ్రాత నీ పలువరుసల్లా ముత్యాల్లా ఉం'దని వ్రాశావు. పచ్చి అబద్ధం. ముఖస్తుతి చేసినా ఉన్న నిజాన్నే అధికం చేసి వ్రాయాలి గాని అబద్ధాలు కూడదు. నా పళ్ళు నీ వెన్నడూ చూసి ఉండలేదు. చూపిఉంటే మధ్య తొప్పి మునిపళ్ళవా? రాను రాను ప్రేలిపోతున్నావు. నీ గుణాలు బయట పడేసుకుంటున్నావు. శేఖరంవద్ద నేర్చుకో, ప్రేమంటే ఏమిటో! ఇంతటితో నీ మర్యాద దక్కించుకో.

—మాలతి."

> వివాహం మాడడానికి ముందు పురుషుడు రెండు కళ్ళూ పూర్తిగా తెరుచుకొని ఉండాలి; తరవాత సగం మూసుకొని ఉండాలి.
>
> —మడామ్ స్కూడేరి

"ఒరేయ్, చలం, ప్రేమలేఖ కూర్పు చెయ్యరా అంటే, నమ్మకద్రోహీ, కాపీ చేసిన చెణుకులు వెలుతావుటరా? ఆ దౌర్భాగ్యుడు ఒక్కరోజైనా మాలతికి తొప్పి పన్ను ఉందని చెప్పాడా ఏడ్చాడా?"

"నాయనా, వెంకూ! ఈ చెప్పుదెబ్బలు చాలు. ఇకనైనా విరమించుకో!" తాపీగా అన్నాడు చలం.

"వదలను. దీని అంతేమిటో అటో ఇటో తేల్చుకుంటాను!"

"తేల్చుకో, నాయనా, తేల్చుకో! కాని బోల్తాకొట్టి మా పరువుమాత్రం తియ్యకు" అన్నాడు చలం.

"చూస్తావుగా! శేఖరం, ఈ మారేం జరిగిందో గడగడా చెప్పేసెయ్!"

"చిత్తం! నీ ఉత్తరాన్ని 'కృతజ్ఞత ఉత్తరం' అని ఇచ్చాను. చదువుకుంది. 'మీ వెంకూ మర్యాద నేర్చుకుంటున్నా' డన్నది. 'ప్రేమ అంటే పిచ్చి అంటారు కొందరు. నీ ఉద్దేశ్యమేమిటి, శేఖరం?' అని అడిగింది. 'దురాక్రమణగా ఒకరి జీవితంతో చెలగాటమాడబోయి అదే ప్రేమ అంటూ పిచ్చిగా ప్రవర్తిస్తారు కొందరు. ఒకరి హృదయాన్ని ఒకరు ఆక్రమించింది నిజమైన ప్రేమ. అట్టి ఆక్రమణకు చాలాకాలం పడుతుంది. అది పిచ్చి ఎన్నటికీ కాదు. జీవితంలో అందరికీ లభించని ఔన్నత్యం. అది లోకాతీతం. కనక అనుభవం లేనివారికి అది పిచ్చిగా కనపడవచ్చు' అన్నాను. 'వెంకూగారు మర్యాద నేర్చుకుని నన్ను గౌరవిస్తున్నారు కాబట్టి వారు స్నేహపాత్రులు. వారి స్నేహాన్ని కోరుతూ ఈ జాబు వ్రాశాను, ఇస్తావు గదూ?' అంటూ పై ఉత్తరాన్ని ఇచ్చింది."

"సరే! సరే! ఈసారి ఇంకో ఉత్తరం ఇస్తాను, మాలతితో స్నేహం లభించినందుకు పొంగిపోయాననీ, అందుకు ఆమోదిస్తూ ఈ ఉత్తరం వ్రాశాననీ అందజెయ్యి."

నాలుగో ఉత్తరానికి సమాధానం.

"మందమతీ!

నా ప్రేమలేఖలు నా దస్తూరీతో మూడున్నాయనీ, అవి బజారులో పెడితే నా బ్రతుకు నవ్వులపాలౌతుందనీ వ్రాశావు. ఆ బెదిరింపు నాలో భయోత్పాతాన్ని కలిగించలేదు. ఇదుగో, ఇది నాలుగో ఉత్తరం. నీవి నాలుగు, నావి నాలుగు. నా ఉత్తరాలన్నీ ఒక్కసారి పునర్విమర్శ చేసుకో! నావీ నీవీ రెండూ కలిపి నేనే బజారో పెట్టగలను. ప్రజలు — దెబ్బలు కొట్టగలరు! డాష్ నీవే పూరించుకో. నీవు బ్లాక్‌మెయిలర్‌వని కూడా బయటపడ్డావు! సిగ్గుపడు!

—మాలతి."

ముచ్చెమటలు పోశాయి వెంకుబాబుకు. "ఓడిపోయానురా, బ్రదర్!" గావుకేక పెట్టాడు.

"ఆఁ, ఆశ్చర్యం!" అన్నాడు కాపీరాయుడు.

"సంతోషం" అన్నాడు శేఖరం.

"ఈసారేం జరిగిందిరా?" అడిగాడు చలం.

"వెంకూ ఊసే ఎత్తలేదు. 'శేఖరం! నిజంగా ప్రేమించినవారు కారణాంతరాలవల్ల ఒకరికొకరు దూరమైతే పరస్పరం ద్వేషించుకుంటారా?' అని అడిగింది. నిజమైన ప్రేమలో ద్వేషానికి తావే లేదనీ, ఒకవేళ అటువంటి ఉదాహరణ లేమైనా కనిపిస్తే అవి నిజమైన ప్రేమలు కావనీ, కేవలం శారీరక వాంఛలు మాత్రమేననీ చెప్పాను. 'అయితే వెంకూకి నీవు చెప్పిన ముక్కలే వ్రాస్తాను. నన్ను ద్వేషించవద్దని కోరతాను' అంటూ గబగబా వ్రాసి ఇచ్చింది పై ఉత్తరం."

"నాయనా! పైత్యంమాత్రలు నాలుగు పుచ్చుకునే వరకూ నాలో దాని ప్రకోపం చల్లారలేదు. మంచి మాత్రలు ఇచ్చింది మాలతి. చెవులు గిల్లుకున్నానని చెప్పు. లెంపలు వేసుకున్నానని చెప్పు. నిజమైన క్షమాపణ వ్రాసి ఇస్తాను, పట్టుకెళ్ళు" అన్నాడు వెంకూ.

"ఇంకేం పాడుబుద్ధి పుట్టిందిరా, నాయనా? ఓడిపోయానురో! అని ఓండ్రపెట్టావు గదరా ఇందాకా?" అన్నాడు చలం.

"ఛ! ఛ! పాడుబుద్ధి కాదురా బాబూ, నిజంగానే!" అంటూ మూడే మూడు ముక్కలు వ్రాశాడు.

"మాలతీ!

క్షమించు.

—వెంకటబాబు."

చదరు ఉత్తరాన్ని తీసుకువెళ్ళిన శేఖరం అయిదో ఉత్తరాన్ని తెచ్చాడు.

గబగబా చెప్పాడు. "ఒరేయ్! 'ఏదో క్షమాపణ ఉత్తరంట' అంటూ ఇచ్చాను మాలతికి. 'ఇంకేమి క్షమాపణ? ఆదిలోనే ఇచ్చాడుగా!' అంటూ ఆ మూడు ముక్కలూ చదువుకొని విరగబడి నవ్వింది. 'శేఖరం, పిపి ప్రాబ్లెమ్స్ సాల్వు చేస్తూ ఉండు చిన్న పని ఉంది" అంటూ వెళ్ళి అరగంట తరవాత ఈ ఉత్తరం ఇచ్చిందిరా నీ కిమ్మని."

ఆత్రంగా విప్పాడు వెంకుబాబు. కవరులో ఒకదానిలో ఒకటి రెండు ఉత్తరాలు ఉన్నాయి! అందులో మొదటిది—

"వెంకూ భయ్యా!

నీలోని పరివర్తనకు మహదానందపడ్డాను. నీమీద పగబూనినట్లు నే వ్రాసినా, అందులో నా స్వార్థంకూడా ఉంది. నీవు ఇచ్చిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకున్నాను. ఎలాగంటావా? విను. శేఖరాన్ని ఎప్పటినించో ప్రేమిస్తున్నాను. ఆయన సౌమ్యుడు. పరిస్థితులు అనుకూలించక నాతో ఎన్నాళ్ళ గానో స్నేహం ఉన్నా ప్రేమభావాలు చూపించడానికి ముందంజ వెయ్యలేదు. ఆడదాన్నిగా నేనూ ముందంజ వెయ్యలేకపోయాను. నీ ఉత్తరాలు మంచి అవకాశం ఇచ్చాయి. ప్రేమ గురించి శేఖర్‌తో ప్రస్తావించ డానికి వీలు కలిగజేశాయి. ఆయన ఉద్దేశ్యాలూ, ఆయన పరిస్థితులూ సమగ్రంగా గ్రహించగలిగాను. స్త్రీగా ముఖాముఖిగా నిన్ను ప్రేమించానని ఏ ఆడది చెప్పగలదు? కాబట్టి ఈ ఉత్తరంద్వారా తెలియ పరుస్తున్నాను. ఇందులో శేఖర్‌గారికి ఉత్తరం ఉంచాను. వారి దౌత్యం ముగిసింది. నీ దౌత్యం ప్రారంభించవూ? అది వారికి అందజెయ్యవూ?

ఇట్లు
నీ శ్రేయోభిలాషిణి,
మాలతీ బహెన్."

"వరె వరె! తన్నితే ఎవడో బూరెల బుట్టలో పడ్డాడట! ఇదుగోరా నాయనా, శేఖరం, ప్రేమలేఖ! కంగ్రాచులేషన్స్!"

శేఖరం సంభ్రమాశ్చర్యాలతో ఉత్తరాన్ని తోలోపల చదువుకో నారంభించాడు.

"ఇంత జరిగాక రహస్య మేమిటోయ్! పైకి చదువు" అన్నాడు వెంకూ.


చదివాడు శేఖరం.

"ప్రియతమ్!

వెంకన్నయ్యకు వ్రాసినది ఈ పాటికి చదివే ఉంటారు. మీకు వ్రాయడానికి కూడా సిగ్గు వేస్తూంది. అన్నయ్య ఉత్తరంలో వ్రాశానుగా? చాల దేమిటి? 'ఆమెకై ఆమె ముందంజ వేస్తే, మీకు నచ్చితే స్వాగతమిస్తా'నన్నారు గదూ! నచ్చింది, శలవిడి వ్రాస్తారు గదూ! అమ్మా, నాన్నా ఏనాటి మండో మీమీద ఆశ పెట్టుకున్నారు. దాటు దాటుగా విన్నాను. మీదే ఆలస్యం. వాళ్ళు 'శుభం' అంటారు. ఎదురు చూస్తూంటాను. ఒప్పుకోలు, వెంకుబాబుతో పంపండి మీ జవాబు.

ఆశలతో ఎదురు చూసే
మీ మాలతీ."

"కంగారు ప్రాయశ్చిత్తం సమాధానం! కొత్తగాలితో మెరిసింది ... వెళ్ళొస్తాను" అని పాటాడిని వేశాడు వెంకూ. ★



పరువపు

చిత్రం—వి. కవిరాజ్ (మద్రాసు-?)